నిరుద్యోగ భృతి కోసం ఆశపడ్డాం



నిరుద్యోగ భృతి ఇస్తామంటే ఎంతో ఆశపడ్డాం. నెలకు రూ.3 వేలు ఇస్తామనడంతో సంతోషంతో కూటమి పార్టీలకు ఓట్లేశాం. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇంత వరకు ఆ పథకం అమలు ఊసే లేదు. ఇంతవరకు నెలకు 3 వేలు చొప్పున రూ.45 వేలకు పైగా రావాల్సి ఉంది. ఇస్తామనడంతో ఆశపడ్డాం. కానీ కూటమి నాయకులను నమ్మి మోసపోయాం.

– ఐ.దివాకర్, నిరుద్యోగి, ఆరిలోవ

హామీలు నమ్మి ఓట్లేశాం

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లేశాను. గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయడం లేదు. ప్రజలను మాటలతో మోసం చేయడం మంచిది కాదు. గ్యాస్ సిలిండర్లు ఏడాదికి మూడు ఉచితంగా ఇస్తామన్నారు. అవి ఎవరికీ సక్రమంగా అందడం లేదు. ప్రతీ మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని ఇచ్చిన హామీ ఊసే లేదు.

– ఆర్.కాంతారావు, శివాజీపాలెం

హామీలన్నీ అమలు చేయండి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. హామీలను నమ్మి ఓట్లేశాం. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం మంచిది కాదు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వమే మాట తప్పితే మోసం చేయడమే అవుతుంది. ఇప్పటికైనా చిత్తశుద్ధితో హామీలన్నీ అమలు చేయాలి.

– ఎం.శ్రీనివాసరావు, పెదవాల్తేరు

అర్హులందరికీ ఉచిత సిలిండర్లు ఇవ్వాలి



అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు కొందరికి ఒకటి, కొందరికి రెండు సిలిండర్లు ఇచ్చి మిగిలిన వారికి ఒక్కటీ ఇవ్వకుండా వదిలేశారు. ఇచ్చిన హామీని సక్రమంగా అమలు చేయడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పూర్తి స్థాయిలో అర్హులందరికీ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందించాలి.

– భీమారావు, విశాలాక్షినగర్

ఉత్తుత్తి హామీలే..

- అధికారంలోకి వచ్చి **ఏడాదిన్నర దాటినా అమలు చేయని కూటమి ప్రభుత్వం**
- ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ **భృతి ఊసే మరిచిన పాలకులు**
- టీడీపీ, జనసేన **హామీలు నమ్మి మోసపోయామంటున్న మహిళలు**

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి **ప్రభుత్వం అధికారంలోకి** వచ్చి 16 నెలలు గడిచినా **ఎన్నికల సమయంలో** ఇచ్చిన హామీలన్నీ నెర**వేర్చలేదు. ఈ పదహారు** నెలల కాలంలో పాలనంతా **మోసం, దగాతో** గడిచిపోయిందని తూర్పు ని**యోజకవర్గంలోని ప్రజలు** ఆవేదన చెందుతున్నారు. మిగిలిన మూడున్నరేళ్ల కాలంలో ఇంకెంత దగా చేస్తారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించి ప్రజలను మభ్యపెట్టారని... అధికారం చేపట్టిన తర్వాత వాటిని సక్రమంగా అమలు చేయకుండా గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరని ఎన్నికల హామీలు..

యువతకు ప్రతీ నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి,



ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ 2024 సాధారణ ఎన్నికల ముందు నుంచే టీడీపీ, జనసేన నాయకులు ఉదరగొట్టేశారు. ఆ హామీలను నమ్మిన జనం ఓట్లేసి గెలిపించారు. అధికారం అందించారు. అధికారం చేపట్టి 16 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు మాత్రం కూటమి నాయకులు ఇంతవరకు నెరవేర్చలేదు.

ఊసేలేని నెలకు రూ.1500 అందజేత

ఎన్నికల సమయంలో ప్రతీ మహిళకు నెలకు రూ.1500 సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు ఆ పథకం అమలు ఊసే పాలకులు ఎత్తడం లేదు. ఈ హామీని పూర్తిగా గాలికి వదిలేశారు. ఆడబిడ్డ నిధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తంలో ఇస్తామం**టూ హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారం చేపట్టి 16 నెలల గడిచినా ఇంతవరకు ఈ పథకం అమలు ప్రస్తావన తీసుకురాలేదు. దీంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబునాయుడు మహిళలకు మొండి చెయ్యి చూపారంటూ తలలు** పట్టుకుంటున్నారు.

వాటిలో గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేశామని చెబుతున్నా... తూతూమంత్రంగానే అమలు చేస్తున్నారు. అర్హులైనప్పటికీ చాలా మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందడం లేదు. ఈ పథకం అమలు విషయంలో మహిళలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించి మొదటి సిలిండరు ఇచ్చి మభ్యపెట్టారు. దీంతో ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేస్తారనుకున్న ప్రజలకు రెండో సిలిండరు నుంచి ఝలక్ తగిలింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు కొందరికి ఒక్క సిలిండర్ మాత్రమే అందగా..., అతి తక్కువ మందికి రెండు సిలిండర్లు అందాయి. ఒక్క సిలిండరూ అందని వారు కూడా చాలా మందే ఉన్నారు. నియోజకవర్గంలో అర్హత గల కుటుంబాలు సుమారు 60 వేలకు పైగా ఉన్నాయి. వాటిలో సగానికి పైగా పూర్తిగా అందని వారు ఉన్నారని స్థానికులు అంటున్నారు. ఈ గ్యాస్ సిలిండర్ల పథకం పూర్తిగా అమలు కాలేదనే విమర్శలు తూర్పు నియోజకవర్గ ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

నిరుద్యోగుల ఆశలన్నీ గాల్లోనే...

నమ్మి ఓట్లేసిన నిరుద్యోగ భృతి హామీ గాలిలో **తేలుతోంది. నిరుద్యో**గులకు నెలకు రూ.3 **వేలు చొప్పున నిరుద్యో**గ భృతి చెల్లిస్తామం**టూ హామీ ఇచ్చి అధికా**రం చేపట్టిన తర్వాత **కూటమి ప్రభుత్వం ఆ** పథకాన్ని గాలికి వది**లేసింది. నియోజకవర్గం**లో వేల మంది నిరు**ద్యోగులు ఈ భృతి కో**సం ఆశగా ఎదురు**చూస్తున్నారు. ప్రభుత్వం** ఏర్పడి 16 నెలలు **గడిచినా ఇంత వరకు** ఈ పథకం అమలు **చేయకుండా మోసం చే**సిందంటూ కూటమి **ప్రభుత్వాన్ని వేలాది** మంది నిరుద్యోగులు **దుమ్మెత్తిపోస్తున్నారు.**

ఉద్యమంలా సంతకాలు సేకరించాలి



జీవీఎంసీ పదో వార్డులో కరపత్రాలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆరిలోవ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై జీవీఎంసీ పదో వార్డులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు మాట్లాడుతూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఉద్యమంలా సంతకాలు సేకరించాలని సూచించారు.

కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కె.ఆర్.పాత్రుడు, జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి రామారావు, నాయకులు వైదా నారాయణరావు, పతివాడ వెంకటలక్ష్మి, మొల్లి వెంకటరమణ, ఒమ్మి శ్రీను, ఇట్ల వరలక్ష్మి, శారద, గోవింద్, తులసి, శ్రీను, చలం, రవీంద్ర, సయ్యద్ అబ్దుల్, శ్రీనివాస్, పుణ్యవతి, కనక, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తూర్పు నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం జీవీఎంసీ పదకొండో వార్డులో మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షుడు ముగడ రమేష్ కార్యకర్తలతో కలిసి సంతకాలు సేకరించారు. వార్డు పరిధి గాంధీనగర్, అన్నానగర్‌లో ఇంటింటికీ వెళ్లి పత్రాలపై సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి ఎర్రాజీరావు, దుర్గా ప్రసాద్, సురేష్, ప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వేదికగా ప్రజలను చైతన్యపరచాలి

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, చేసిన మంచి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యపరచడంలో సోషల్ మీడియా వింగ్ కృషి ఎంతో అవసరమని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. సీతమ్మధారలోని నియోజకవర్గ కార్యాలయంలో శనివారం సోషల్ మీడియా విభాగం నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతంలో సోషల్ మీడియా విభాగం చాలా కీలకమన్నారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మంచిని వీడియోలు, మెసేజ్‌ల రూపంలో చేరవేయాలన్నారు. కూటమి ప్రభుత్వం మన పార్టీపై, నాయకులపై చేస్తున్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా ప్రజలకు వివరించి విజయం సాధించాలన్నారు. పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి దోహదపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి బెవరా జగదీష్, జిల్లా అధ్యక్షుడు బోండా ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉంగరాల చరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి మెట్ట సూర్యనారాయణ, తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, వివిధ వార్డుల అధ్యక్షులు బోయి రమణరెడ్డి, రవీంద్ర చౌదరి, జేమ్స్, దుర్గారావు పాల్గొన్నారు.



మొల్లి అప్పారావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వింగ్ ప్రతినిధులు

జీతాలు పెంచాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన

ఎంవీపీ కాలనీ : నెల వారీ జీతాలు పెంచడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు, సిబ్బంది నిరసనకు దిగారు. వాల్తేర్ డిపో ఆవరణలో శనివారం ఉదయం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ రోజువారీగా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై డిపో యాజమాన్యం సంబంధం లేనట్లు వ్యవహరిస్తోందన్నారు. సంఘం అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ వాల్తేర్ డిపో పరిధిలో 80 మంది డ్రైవర్లు ఉండగా 29 అద్దె బస్సు సర్వీసులు నడుస్తున్నాయన్నారు. అయితే డ్రైవర్లకు జీతాలు పెంచాలని కోరుతూ గత 3 నెలలుగా డిపో అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. అద్దె బస్సుల యజమానులతో చర్చించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అద్దె బస్సుల యజమానులతో కుమ్మక్కై డ్రైవర్లకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రూ.18 వేలు జీతంగా చెల్లిస్తుండగా కుటుంబ అవసరాలు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26 వేలు చెల్లించాలని గత కొంతకాలంగా సంఘం ఆధ్వర్యంలో కోరుతున్నట్లు తెలిపారు. అయితే అందుకు అనుగుణంగా డిపో యాజమాన్యం బస్సుల యజమానులతో చర్చించి న్యాయం చేయడం లేదన్నారు. ఈ నెల 15 నుంచి నిరసనకు దిగుతామని చెప్పగా బస్సుల యజమానులతో చర్చలు జరిపేందుకు 2 రోజులు సమయం ఇవ్వాలని అధికారులు కోరారన్నారు. అయితే 2 రోజులు సమయం గడిచిపోయినా పరిష్కారం లభించకపోవడంతో నిరసనకు దిగినట్లు తెలిపారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే నిరసనను మరింత ఉధృతం చేస్తామన్నారు.



వాల్తేర్ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు, సిబ్బంది, సిటు నాయకులు

ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలు శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి ఏర్పాట్లు పూర్తికావడంతో చాలా మంది వ్యాపారులు వారి స్టాళ్లలో విక్రయాలు ప్రారంభించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఈ మైదానంలో బాణసంచా విక్రమాలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 40 వరకు దుకాణాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. గతంలో మాదిరి కాకుండా మైదానం చుట్టూ సర్కిల్ మాదిరిగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇటు వినియోగదారులకు సౌకర్యార్థం, అటు పార్కింగ్‌కు ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేశారు. నేరుగా వినియోగదారులు మైదానంలోకి వచ్చి వాహనాలు పార్కింగ్ చేసుకుని విక్రయాలు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆయా భద్రతా ఏర్పాట్లను ఎంవీపీ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.



ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులు


టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ఆరిలోవ : ఆనందంగా జరుపుకునే దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ అర్పితా రెడ్డి, డాక్టర్ నికితా దాస్ సూచించారు. హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టపాసులు కాల్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చినప్పుడు కళ్లజోడు పెట్టుకోవాలని, పిల్లలు టపాసులు కాల్చినప్పుడు పెద్దలు పర్యవేక్షించాలని, గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ డబ్బాలు, మండే స్వభావమున్న పదార్థాలను దూరంగా ఉంచాలని సూచించారు. టపాసులను బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలన్నారు. ఒకవేళ టపాసులు కాల్చుతుండగా కళ్లకు ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అందుబాటులో ఉండే కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంటిని నలపకుండా సున్నితంగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో అత్యవసర సేవలు అందించడానికి 7095031666, 9396712020 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌లో ఓ మహిళ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ ప్రాంతానికి చెందిన బుద్దెపు రమ (42) హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. డ్యూటీ కోసం శనివారం రాత్రి మధురవాడ నుంచి వస్తూ పెదగదిలి వద్ద అపోలో ఆస్పత్రి ఎదురుగా ఆటో దిగి రోడ్డు దాటుతున్న సమయంలో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న ఆర్టీసీ 68ఎ నంబరు గల సిటీ బస్ ఆమెను ఢీకొట్టింది. దీంతో కిందపడిని ఆమె తలకు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరింది. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఆమెను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 నుంచి వర్క్‌షాప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శనివారం ఆవిష్కరించారు. రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్ష అభియాన్ సహకారంతో మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్ ప్రోటోకాల్స్ అండ్ క్రిప్టోగ్రఫీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ప్రాథమిక అవగాహన కల్పించడం వర్క్‌షాప్ ఉద్దేశమని వీసీ రాజశేఖర్ తెలిపారు.

ఏయూ మ్యూజియానికి సందర్శకులు

మద్దిలపాలెం : ఏయూ బోటనీ మ్యూజియం, హెర్బేరియం, బొటానికల్ గార్డెన్‌కు రోజురోజుకూ సందర్శకులు పెరుగుతున్నారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వీసీ జి.పి.రాజశేఖర్ ప్రతి మూడో శనివారం వృక్షశాస్త్ర విభాగం నుంచి వివిధ మొక్కల జాతులపై జ్ఞానం పొందడానికి విద్యార్థులు, పరిశోధకులు, ఎన్‌జీవో సంస్థలు, సాధారణ ప్రజలకు అనుమతి కల్పిస్తూ పోస్టర్‌ను విడుదల చేశారు. అప్పటి నుంచి ఆశ్వార్దాస్ పాఠశాల, ఉషోదయ డిగ్రీ కళాశాల, సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల, ఏయూ ఎమ్మెస్సీ విభాగం విద్యార్థులు సందర్శించారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డి.సంధ్య దీపిక, క్యూరేటర్ డాక్టర్ జె.ప్రకాశరావు సందర్శకులను స్వాగతించి అవగాహన కల్పించారు.



ఏయూ బోటనీ మ్యూజియంలో విద్యార్థులు

మొక్కల పెంపకంతో కాలుష్య నియంత్రణ



ఆరిలోవ రైతుబజార్‌లో శుభ్రం చేస్తున్న రైతులు, సిబ్బంది

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆరిలోవ రైతు బజార్‌లో ఈవో నాయుడు, సిబ్బంది ఇక్కడ కాయగూరలు విక్రయించే రైతులతో కలిసి ఆవరణను శుభ్రం చేశారు. వారితో వినియోగదారులు కూడా చేయి కలిపారు. రైతు బజార్ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, చీపుర్లతో తుడిచి శుభ్రం చేశారు.

- విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విమ్స్ ఆవరణలో డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆవరణలో పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటాలని, వాహనాల వినియోగం నియంత్రించాలని సూచించారు. వ్యక్తిగత వాహనాలకు బదులుగా ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



విమ్స్ ఆవరణలో మొక్క నాటుతున్న డైరెక్టర్, వైద్యులు



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ అనుకూల కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి సైకిళ్లు, సౌరశక్తిని ఉపయోగించాలని సూచించారు.

చిత్తశుద్ధితో పని చేస్తే వైఎస్సార్ సీపీలో గుర్తింపు

మద్దిలపాలెం : వైఎస్సార్ సీపీని నమ్ముకుని చిత్తశుద్ధితో పనిచేసే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని, పార్టీ అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అంగన్‌వాడీ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఇప్పిలి పార్వతిని నియమించారు. ఈ సందర్భంగా ఆమె సీతమ్మధారలోని నియోజకవర్గ కార్యాలయంలో మొల్లి అప్పారావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని, వారి సేవలను ఎప్పుడూ గుర్తించి తగిన గౌరవం కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఇప్పిలి పార్వతి మాట్లాడుతూ తనను పదవిలో నియమించడానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. అందరినీ కలుపుకుని వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



ఇప్పిలి పార్వతిని సత్కరిస్తున్న మొల్లి అప్పారావు

మెరుగైన సేవలతో నవజాత శిశువుల సంరక్షణ

ఎంవీపీ కాలనీ : నవజాత శిశువులతోపాటు గర్భంలోనే అనారోగ్య సమస్యలకు గురయ్యే పిల్లల సంరక్షణకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అవసరమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి అన్నారు. లోటస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా నవజాత శిశువుల ఆత్మీయ, ఆరోగ్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు, తక్కువ బరువు, ముందస్తు ప్రసవం కారణంగా జన్మించే పిల్లలను సంరక్షించడం డాక్టర్లకు సవాళ్లతో కూడిన వ్యవహారమన్నారు. ఇలాంటి పిల్లలను సంరక్షించేందుకు మరింత ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావాల్సి వుందన్నారు. దాంతోపాటు డాక్టర్లకు ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు.



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

హాస్పిటల్ డైరెక్టర్ కేవీ కృష్ణవర్ధన్ మాట్లాడుతూ లోటస్ హాస్పిటల్ గత 10 ఏళ్లలో 150 మంది పిల్లలను సంరక్షించిందన్నారు. డాక్టర్ శేషగిరి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మాధురి, డాక్టర్ హేమ, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరిలోవ రైతు బజార్‌కు తాత్కాలిక బోర్డు ఏర్పాటు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రైతు బజార్ బోర్డు

ఆరిలోవ : ఆరిలోవ రైతు బజార్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఈ నెల 2న పెదగదిలి బ్రిడ్జి సమీపంలో విమ్స్ గోడ పక్కన రైతు బజార్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పలు సమస్యలతో కొనసాగుతోంది. దీనిపై 'రైతు బజార్ ఏర్పాటు చేసి... సమస్యలు మరిచారు' శీర్షికతో ఈ నెల 8న సాక్షిలో ప్రచురించిన కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రధాన రహదారిపై ప్రజలకు కనిపించే విధంగా రైతు బజార్ బోర్డు ఏర్పాటు చేశారు. రోడ్డుకు కొంత లోపలకు ఉన్న బజార్‌కు దారి చూపుతూ సూచికతో కూడిన బోర్డు విద్యుత్ స్తంభాలకు అమర్చారు. దీంతో రహదారిపై వెళ్లే వారికి ఈ బోర్డు ద్వారా రైతు బజార్ ఉన్నట్లు సులువుగా తెలుస్తోంది.

బాణసంచా పట్టివేత



పట్టుకున్న బాణసంచాతో పోలీసులు

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆరిలోవ పోలీసులు అనధికారిక బాణసంచా విక్రయాలపై శనివారం కొరడా ఝుళిపించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సూరి కిశోర్ అక్రమంగా బాణసంచా నిల్వ చేసినట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అతని నుంచి సుమారు రూ.70 వేలు విలువ చేసే బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. కిశోర్‌పై కేసు నమోదుచేసి సరకును ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. అక్రమంగా బాణసంచా నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు హెచ్చరించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరీలో కళాకారులు

మద్దిలపాలెం : ఆలిండియా రేడియో నుంచి గ్రేడింగ్ పొందిన వర్ధమాన కళాకారులు 8 మంది విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం కళాభారతిలో గాత్ర కచేరీ నిర్వహించారు. వీరిలో నలుగురు గాత్రంతో, ఇద్దరు వయోలిన్‌తో, ఇద్దరు మృదంగంతో ప్రతిభ కనబరిచి సంగీత ప్రియుల హృదయాలను దోచుకున్నారు. అంతకు ముందు వీఎండీఏ అధ్యక్షుడు ఎమ్ఎస్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, పంతుల గోపాలరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ప్రభుత్వరంగాన్ని బలహీనపరిచే చర్యలు విడనాడాలి

దాబాగార్డెన్స్: ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం, బీజేపీకి మిత్రులుగా ఉన్న రాజకీయ పార్టీలు బలహీన పరిచే చర్యలు తక్షణం విడనాడాలని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం లోక్‌సభ ఫ్లోర్ లీడర్, దళిత సోషన్ ముక్తి మంచ్ అఖిల భారత అధ్యక్షుడు కె.రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో సిటు, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ప్రభుత్వ రంగం – సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా పనిచేశాయన్నారు. ప్రైవేట్ రంగం ద్వారానే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్న భ్రమలు నేడు తొలగిపోయాయన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తనకు నచ్చిన వారికి ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులు, దేశ సంపదను కట్టబెడుతోందని, ఈ విధానం తగదన్నారు. కార్యక్రమంలో సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డీఎస్ఎంఎం అఖిల భారత కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిటు రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ధనలక్ష్మి, కేవీపీఎస్ నాయకులు కె.లోకనాథం, ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, వై.రాజు, సిటు జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ పాల్గొన్నారు.